సాక్షి
వికారాబాద్

బుధవారం ¦ 8 ¦ జనవరి ¦ 2025



రుణాలు ఇవ్వరా?

నిధులున్నా మహిళా సంఘాలకు సకాలంలో రుణాలు ఇవ్వకపోవడంపై డీఆర్‌డీఓ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸



వైభవంగా మైసమ్మ పండుగ

వికారాబాద్ మండలం గొట్టిముక్కల గ్రామంలో మంగళవారం మైసమ్మ పండుగను వైభవంగా నిర్వహించారు. 8లో▸



'కంది'.. రైతన్న రంది

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సరిపోవడం లేదని కంది రైతులు వాపోతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

11న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

దుద్యాల్: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని హస్నాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో ఈ నెల 11న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నరేశ్, శేఖర్, పవన్, శ్రీనివాస్, కృష్ణ, శ్రీకాంత్, అబ్బు, గోపాల్, గోవర్ధన్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే జట్లు 10వ తేదీలోపు రూ.1000 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేత జట్టుకు రూ.30 వేలు, రెండో స్థానంలో నిలిచే జట్టుకు రూ.20 వేలు, మూడో విజేతకు రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 7989622670లో సంప్రదించాలని కోరారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి వస్తున్నట్లు తెలిపారు.

రేపు కబడ్డీ పోటీలు

అనంతగిరి: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న సబ్ జూనియర్ లెవల్ బాలబాలికల టోర్నమెంట్, సెలక్షన్స్ జరుగుతాయని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్స్ వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో ఉంటాయన్నారు. 16 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. గెలుపొందిన బాలబాలికలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడిగా తిమ్యానాయక్



అనంతగిరి: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జరుపుల తిమ్యానాయక్ ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నేనావత్ రవికుమార్, గౌరవ అధ్యక్షుడిగా గోబ్రియా నాయక్, కోశాధికారిగా నీల్యానాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ గోవింద్ నాయక్ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా గిరిజన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుంటున్నట్లు తెలిపారు. గిరిజన ఉపాధ్యాయులు ఇన్‌సర్వీస్‌లో పీజీ చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అంబర్‌సింగ్ నాయక్, కోశాధికారి కృష్ణానాయక్, నాయకులు రమేష్ నాయక్, హీరాలాల్, బాబుసింగ్, హరిలాల్, గోపాల్, వెంకట్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు పాండునాయక్, హీర్యానాయక్, నర్స్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'కళరిపయట్టు'లో సత్తా చాటిన విద్యార్థినులు



అవార్డులు అందుకుంటున్న విద్యార్థినులు

కొడంగల్ రూరల్: తెలంగాణ సాంస్కృతిక శాఖ, సింగిడి కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ఇందులో కొడంగల్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థినులు ప్రణవి, అర్చన, మాధవి, శివాని, కీర్తన కళరిపయట్టు విద్యలోని యుద్ధ విన్యాసాలతో అందరినీ అబ్బురపరిచారు. ఉత్తమ ప్రతిభ చాటి అవార్డులు అందుకున్నట్లు కళరిపయట్టు శిక్షకులు రమేష్ ఆచార్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

నేడు చేవెళ్లలో మంత్రుల పర్యటన

చేవెళ్ల: మండలంలో బుధవారం మంత్రుల చేతల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఉండనున్నాయి. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. మండలంలోని ముడిమ్యాల నుంచి రావులపల్లి, మెడిపల్లి మీదుగా ప్రొద్దటూరు గేట్ వరకు వేసే రోడ్డుకు శంకుస్థాపన, చేవెళ్ల మండల కేంద్రంలో పీఏసీఎస్ గోదాం, పీఏసీఎస్ కార్యాలయ భవనాల ప్రారంభోత్సవాలు ఉంటాయని పేర్కొంది. ఆయా కార్యక్రమాలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలిలో ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరుకానున్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ఉంటుందని ప్రకటనలో తెలిపారు.

కాపుకాసి.. డబ్బు దోచి!

జిల్లాకు పాకిన అటెన్షన్ డైవర్షన్ చోరీలు

- అమాయక ప్రజలే టార్గెట్
- పోలీసులమంటూ బెదిరింపులు
- తరచూ ఇలాంటి ఘటనలు
- తాజాగా రూ.50 వేలతో ఉడాయించిన దొంగలు
- కేసుల నమోదులో నిర్లక్ష్యం



వికారాబాద్: జిల్లాలో పట్టపగలే జరుగుతున్న దోపిడీలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు నగరానికే పరిమితమైన ఈ తరహా అటెన్షన్ డైవర్షన్ చోరీలు జిల్లాకు పాకాయి. బ్యాంకులు, ఏటీఎంలు, పోస్టాఫీసుల్లో డబ్బులు డ్రా చేసే వారిని టార్గెట్‌గా చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్నారు.

- వారం రోజుల క్రితం నవాబుపేట మండలం నారెగూడ గ్రామానికి చెందిన గంగ్యాడ నర్సింహులు డబ్బులు డ్రా చేసుకునేందుకు వికారాబాద్ పోస్టాఫీసుకు వచ్చాడు. తన ఖాతా నుంచి రూ.1.94 లక్షలు డ్రా చేసుకొని రైల్వే స్టేషన్ మార్గంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. నర్సింహులు డబ్బులు డ్రా చేయడం గమనించిన ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి అడ్డగించారు. తాము పోలీసులమని.. నీ బ్యాగ్‌లో గంజాయి ఉన్నట్లు తమకు సమాచారం వచ్చిందని భయపెట్టారు. చెక్ చేయాలని బ్యాగ్ తీసుకున్నారు. అందులోంచి రూ.50 వేల బండిల్ తీసుకుని బైక్‌పై ఉడాయించారు. నర్సింహులు తేరుకొనే లోపు అక్కడి నుంచి మాయమయ్యారు. ఈ విషయమై అదే రోజు వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.
- ఎనిమిది నెలల క్రితం కూడా వికారాబాద్ పట్టణంలో సరిగ్గా ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఓ వ్యక్తి పట్టణంలోని ఓ బ్యాంకులో నగదు డ్రా చేసుకున్నాడు. ఇది గమనించిన ఇద్దరు దుండగులు కొంత దూరం వెంబడించారు. ఎవరూ లేని ప్రదేశంలో డబ్బు తీసుకెళ్తున్న వ్యక్తిని ఆపారు. తాము పోలీసులమని, నీ బ్యాగ్‌లో నకిలీ నోట్లు ఉన్నాయని భయపెట్టారు. బ్యాగులోని నోట్లను పరిశీస్తున్నట్లు నటించి నగదుతో ఉడాయించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. కానీ ఇప్పటి వరకు కేసులో ఎలాంటి పురోగతి లేదు.
- ఆరు నెలల క్రితం నవాబుపేట మండలం మీనపల్లికలాన్‌కు చెందిన తల్లి కూతురు అత్తగారి ఇంటికి బయలు దేరారు. గేట్ వనంపల్లి సమీపంలో వికారాబాద్ – సాదాశివాపేట్ రోడ్డుపై నిలబడ్డారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో దుండగులు (కొందరు ఆడ, మరికొందరు మగ) ఫ్యామిలీలా కారులో వచ్చి లిఫ్ట్ ఇస్తామని తల్లికూతుళ్లను బలవంతంగా ఎక్కించుకున్నారు. కొద్ది దూరం వెళ్లగానే వారి మెడలోని బంగారు గొలుసులు లాక్కున్నారు. కారును కొంచం మెల్లగా పోనిచ్చి వారిని కిందకు తోసేసి పరారయ్యారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా సిబ్బంది కేసు నమోదు చేసుకోలేదు. దీంతో వేరే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి నవాబుపేట పీఎస్‌కు బదిలీ చేశారు. ఈ కేసులో కూడా ఎలాంటి పురోగతి లేదు. ఇవి ఉదాహరణలు కొన్ని మాత్రమే.. ఇటీవల పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో బైకులు, దొంగతనాలు జరిగినా పోలీసులు కేసులు నమోదు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

బాధితులకు జరగని న్యాయం

సాధారణంగా కొన్ని కేసులను బాధితులు పోలీస్ స్టేషన్‌లో పరిష్కరించుకొని వెళుతుంటారు. కానీ దొంగతనాలు, చీటింగ్ తదితర కేసుల్లో ఇలాంటి పరిస్థితి ఉండదు. కేసు నమోదై దొంగలు దొరికినప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుంది.. పోలీసులు రికవరీ చేసిన సొమ్ము బాధితులకు దక్కుతుంది. ఒకవేళ కేసులు నమోదు చేయకుంటే దొంగలు దొరినా నష్టపోయిన వారికి సొత్తు ఇవ్వాటానికి వీలుపడదు. దీంతో బాధితులు నష్టపోతారు. కానీ చాలా కేసుల్లో పోలీసులు ఫిర్యాదులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కానరాని పారదర్శకత..

కేసుల నమోదులో జిల్లా అధికారులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. కేసుల నమోదులో పారదర్శకత పాటిస్తున్నామని పైస్థాయి పోలీసు అధికారులు చెబుతున్నా ఫిర్యాదు బుట్టదాఖలు అవుతున్నట్లు తెలుస్తోంది.



ప్రత్యేక పోస్టల్ స్టాంప్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పోస్టల్ స్టాంప్‌లపై అవగాహన ఉండాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: విద్యార్థులకు బాల్యం నుంచే పోస్టల్ స్టాంప్‌లపై అవగాహన ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పోస్టల్ శాఖ ప్రత్యేక స్టాంపుల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు అనంతగిరి ఫెక్స్ పేరిట ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థులే అని.. తాను కూడా తెలుగు, కన్నడ భాషలు నేర్చుకుంటున్నట్లు తెలిపారు. నేను పదో తరగతి చదివే సమయంలో మా పెదనాన్న ఇల్లు ఖాళీ చేశాడని.. ఆ సమయంలో ఒక పుస్తకం చూసి ఆశ్చర్య పోయానని తెలిపారు. ఆ పుస్తకంలో దాదాపు 100 స్టాంపులు ఉన్నాయని.. వాటి గురించి తెలుసుకోవడానికి 30 నుంచి 40 రోజుల సమయం పట్టిందన్నారు. గతంలో రక్ష బంధన్, దసరా పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టల్ కార్డులు వచ్చేవన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ తపాలా శాఖ అధికారులు సుబ్రహ్మణ్యం, ఎంబీ ప్రసాద్, శ్రీనివాష్, సిబ్బంది కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఆంగ్ల బోధనకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాలల్లో ఇంగ్లిష్‌ను సులభతరంగా బోధించడంపై మండల విద్యాధికారులు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు సులభతరంగా అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డీఈఓ రేణుకాదేవి, వయోజన విద్య అధికారి శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మహబూబా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి ద్వారా మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందించనున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద నిరాశ్రయులు, వితంతువు, విడాకులు తీసుకున్న మహిళలు అనాథ, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. తెల్ల రేషన్ కార్డు, ఆహారభద్రత కార్డు రెండు లేకపోతే గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలు ఆదాయం మించకూడదన్నారు. వయస్సు 21 నుంచి 55 సంవత్సరాలు మించరాదన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ప్రభుత్వ గుర్తింపుపొందిన సంస్థ ద్వారా నేర్చుకున్న టేలరింగ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. కనీసం 5వ తరగతి విద్యార్హత కలిగి ఉండలన్నారు.

ముగ్గుల పోటీలు నేడు

'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నేడు

'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం (నేడు) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తాండూరులో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ మార్గంలోని స్థానిక గంగోత్రి విద్యాలయంలో నిర్వహించే పోటీల్లో విజేతలకు స్కూల్ చైర్మన్ ఇందూర్ రాములు సౌజన్యంతో బహుమతులు అందజేస్తారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరుకానున్నారు.



మొదటి బహుమతి: రూ.10,000
రెండో బహుమతి: రూ.5,000
మూడో బహుమతి: రూ.2,000

పూర్తి వివరాలకు:
సెల్: 88853 27301

మున్సిపల్ కార్మికుల ఆందోళన



తాండూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

- కమిషనర్‌ను దూషించిన కాంగ్రెస్ నాయకుడు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన తిట్ల దండకం
- చర్యలు తీసుకోవాలంటూ కార్మికుల ధర్నా



హబీబ్‌లాలాపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ ఉద్యోగుల సంఘం నేతలు

తాండూరు టౌన్: తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాలా దూషించడాన్ని నిరశిస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళనకు దిగారు. పారిశుద్ధ్య నిర్వహణపై కమిషనర్‌కు హబీబ్‌లాలా ఫోన్ చేయగా.. ఆయన లిఫ్ట్ చేయలేదు.. దీంతో పరుషపదజాలంతో దూషించినట్లు సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఆగ్రహించిన మున్సిపల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తి అయినంత మాత్రాన ఇష్టానుసారంగా కమిషనర్‌ను దూషిస్తారా అంటూ కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు, కౌన్సిలర్ సోమశేఖర్ ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు, నాయకుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. అనంతరం కార్మిక సంఘం నాయకుడు గోపాల్ మాట్లాడుతూ.. కమిషనర్‌ను అకారణంగా దూషించడం సరికాదన్నారు. అనంతరం మున్సిపల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి కార్యాలయం ఎదుట నిరశన తెలిపారు. టీఎన్‌జీఓ ఆధ్వర్యంలో హబీబ్‌లాలాపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కార్మికులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కార్మికులతో ఫోన్‌లో మాట్లాడారు. కమిషనర్‌ను దూషించిన విషయం గురించి తాను రేపు మాట్లాడతానని హామీ ఇచ్చారు. యథావిధిగా పనులకు వెళ్లాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కార్మికులకు సూచించారు. దీంతో వారు విధులకు హాజరయ్యారు.

బీఆర్‌ఎస్ మద్దతు

మున్సిపల్ కార్మికులకు బీఆర్‌ఎస్ శ్రేణులు మద్దతు పలికారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ మాట్లాడుతూ.. దౌర్జన్యాలకు దిగడం కాంగ్రెస్ పార్టీ డీఎన్‌ఏలోనే ఉందన్నారు. అధికారం ఉందని విర్రవీగితే ప్రజలు తిరగబడతారన్నారు. హబీబ్‌లాలాను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నయీం, సలీం, వెంకట్‌రెడ్డి, శ్రీధర్, దత్తాత్రేయ, సందీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మా భాష ఇట్లనే ఉంటది: హబీబ్‌లాలా

పట్టణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది.. ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో కమిషనర్‌కు ఫోన్ చేశా.. ఆయన లిఫ్ట్ చేయలేదు. సాధారణంగా ఉపయోగించే భాషనే మాట్లాడాను.. దాన్ని రాద్ధాంతం చేస్తున్నారు.. మా భాష ఇట్లనే ఉంటుందని హబీబ్‌లాలా అన్నారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుంటే చూస్తూ ఎలా ఊరుకోవాలని ఆయన ఎదురు ప్రశ్నించారు.

మున్సిపాలిటీలకు కేంద్రం చేయూత



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ డీకే అరుణ తదితరులు

- అమృత్ 2 పథకం కింద కొడంగల్‌కు రూ.4.5 కోట్లు మంజూరు
- ఎంపీ డీకే అరుణ
- అభివృద్ధి పనులకు భూమిపూజ

కొడంగల్: మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం చేయూత ఇస్తోందని.. ఇందులో భాగంగా అమృత్ 2 పథకం కింద కొడంగల్‌కు రూ.4.5 కోట్లు మంజూరు చేసినట్లు ఎంపీ డీకే అరుణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని కార్గిల్ కాలనీ సమీపంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2 పథకం కింద నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్, పట్టణాలు అభివృద్ధి చెందాలన్నదే ప్రధాని మోదీ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగానే ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, రైతు వేదికలు, వైకుంఠధామాలు నిర్మించినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రంలో ఇల్లు లేని పేదలకు ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి వ్యక్తి జీవితంలో ఉన్నతంగా జీవించాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, నాయకుడు పున్నం చంద్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో తాండూరు గృహిణి సత్తా

48 ఏళ్ల వయసులో రెండు గోల్డ్ మెడల్స్

తాండూరు టౌన్: క్రీడలు అనేవి కేవలం యుక్త వయసులో ఉన్న వారికి మాత్రమే సరిపోతాయి అనుకునే వారిని ఆశ్చర్యగొలిపే విధంగా తాండూరుకు చెందిన ఓ గృహిణి నాలుగు పదుల వయసులో అథ్లెటిక్స్‌లో రాణించి సత్తా చాటింది. పెళ్లి.. సంతానం కలగగానే ఇక వంటింటికే పరిమితం కావాలి అనుకునే వారికి ఈమెని చూస్తే ఏదో నూతన ఉత్సాహం రాకమానదు. చిన్నప్పుడు పాఠశాల, కళాశాల క్రీడల్లో విశేషంగా రాణించి, ఆ తర్వాత కాలక్రమంలో పెళ్లి అయిపోయి, తిరిగి క్రీడల్లో తమ ప్రావీణ్యాన్ని చాటుకునే అవకాశం లేక ఎందరో తమ టాలెంట్‌ను గుండెల్లోనే దాచుకుంటున్నారు. అయితే అందరిలా కాకుండా వయసు పెరిగినా క్రీడల పట్ల తనకున్న మమకారం, ఆరోగ్య రీత్యాఫిట్‌నెస్‌పై ఉన్న ఆకాంక్ష మాత్రం దూరం కాలేదు. ఈక్రమంలోనే తెలంగాణ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి మెడల్స్ సాధించి మహిళలు అనుకుంటే వయసుతో పనిలేకుండా క్రీడల్లో రాణించవచ్చని నిరూపించారు తాండూరు పట్టణానికి చెందిన 48 ఏళ్ల సంతోషి. భర్త నటరాజ్ ప్రోత్సాహంతో ఈ ఘనత సాధించి శభాష్ అనిపించుకున్నారు.

రెండు బంగారు పతకాలు

మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4,5వ తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సంతోషి పాల్గొని సత్తా చాటారు. 45 – 50 ఏళ్ల విభాగంలో సంతోషి చక్కటి ప్రదర్శనతో లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లలో రెండు బంగారు పతకాలు సాధించారు. అథ్లెట్ సంతోషిని స్థానికులు, కుటుంబ సభ్యులు అభినందించారు. జాతీయ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

జాతీయ స్థాయి పోటీలకు..

అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన సంతోషి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని త్రిశూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో పోటీల్లో పాల్గొననున్నారు. అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన సంతోషిని తాండూరు వాసులు అభినందనలతో ముంచెత్తారు.

చిన్ననాటి నుంచే..

తాండూరు పట్టణంలోని సెయింట్ మార్క్స్ స్కూల్‌లో 1992లో పదో తరగతి, సింధు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్, హైదరాబాద్‌లోని భవన్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు సంతోషి. 2001లో వ్యాపారి నటరాజ్‌ను వివాహం చేసుకున్న ఆమెకు డిగ్రీ, ఇంటర్ చదువుతున్న ఇద్దరు కుమారులున్నారు. పాఠశాల వయసు నుంచే రన్నింగ్, ఖోఖో, లాంగ్‌జంప్ తదితర క్రీడల్లో చాంపియన్‌గా నిలిచిన సంతోషి, అదే తీరును మాస్టర్ అథ్లెటిక్స్‌లో కూడా ప్రదర్శించారు.



గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందుకుంటున్న అథ్లెట్ సంతోషి

ఫిట్‌నెస్ ఉండాలి



వివాహం అయిపోయింది, ఇక మనకు ఆటలు ఎందుకులే అని మహిళలు అనుకోకూడదు. క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి. మహిళలు క్రమం తప్పకుండా నిత్యం వ్యాయామం చేసి ఫిట్‌నెస్ సాధించాలి. 48 ఏళ్ల వయసులో నేను అథ్లెటిక్స్‌లో రాణించడానికి కారణం ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడమే. మహిళలు ఏదైనా సాధించవచ్చని నిరూపించడానికే నేను క్రీడా పోటీల్లో పాల్గొన్నాను.

– సంతోషి, తాండూరు

క్లుప్తంగా

తల్లిదండ్రులు మందలించడంతో..

బాలుడి బలవన్మరణం

యాలాల: తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ బాలుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని దౌలాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డే భీములు(17) మద్యానికి అలవాటుపడ్డాడు. సోమవారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు వెంకటయ్య, సావిత్రమ్మ మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన భీములు గ్రామ శివారులో వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు శవానికి తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురు ఆర్‌ఎంపీలపై కేసు

ధారూరు: మండల కేంద్రంలో క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఐదుగురు ఆర్‌ఎంపీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ మంగళవారం తెలిపారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు గతేడాది మండల కేంద్రంలో నిర్వహించిన తనిఖీల్లో చికిత్సలు చేస్తున్న ఆర్‌ఎంపీలు మీర్ ఇసాక్‌అలీ, అనిల్‌కుమార్, అశోక్‌కుమార్, ఆజాం, సునీల్‌పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ ఆఫీసర్ రాము ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో, బైక్ ఢీ

ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

కుల్కచర్ల: ఎదురెదురుగా ఆటో, బైక్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మంగళవారం కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన దస్తగిరి బైక్‌పై చౌడాపూర్ వైపు ప్రయాణిస్తున్నాడు. చౌడాపూర్ నుంచి నవాబుపేట్ వైపు ప్రయాణిస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు దస్తగిరి గాయపడగా చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మెడికల్ ఆఫీసర్‌కు సన్మానం



మెడికల్ ఆఫీసర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం

బంట్వారం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన మాజిద్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేషం మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. బంట్వారం పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆస్పత్రిలో ఏమైనా సమస్యలుంటే పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, యాదగిరి, సుధాకర్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి ఘటనలో కేసు దర్యాప్తు

పహాడీషరీఫ్: తుక్కుగూడ జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు రాములుపై జరిగిన దాడి ఘటనపై పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. డిసెంబర్ 21న పాఠశాలలో రాములుపై అవమానకరంగా వ్యవహరించిన ఘటనపై ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసినట్లుగా కేసు నమోదయింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

‘మహాలక్ష్మి’ మాయాజాలం!

సర్కారు ‘సబ్సిడీ సిలిండర్’ పక్కదారి

- యథేచ్ఛగా హోటళ్లు, దాబాలకు సరఫరా చేస్తున్న ఏజెన్సీలు
- వినియోగదారుల నుంచి రవాణా ఖర్చు పేరిట రూ.50 అదనంగా వసూలు
- పట్టించుకోని పౌరసరఫరాల అధికారులు

బషీరాబాద్: పేదలకోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ పథకంలో అక్రమార్కులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. సర్కారు అందిస్తున్న సబ్సిడీ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణాలు, మండల కేంద్రాల్లోని హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్‌లలో కమర్షియల్ సిలిండర్ స్థానంలో సబ్సిడీ సిలిండర్లు బాహాటంగానే వినియోగిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు రూ.500కు ఇచ్చే సిలిండర్‌పై రవాణా ఖర్చు పేరిట అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.



బషీరాబాద్‌లోని ఓ హోటల్‌కు సబ్సిడీ సిలిండర్ సరఫరా చేస్తున్న డెలివరీ బాయ్



ఓ హోటల్‌లో వినియోగిస్తున్న డొమెస్టిక్ సిలిండర్

వ్యాపార కేంద్రాలకు డొమెస్టిక్ సిలిండర్లు

జిల్లా వ్యాప్తంగా 21 గ్యాస్ ఏజెన్సీలుండగా వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో 2,05,344 మంది గృహ వినియోగదారులు, 3,209 వాణిజ్య ఎల్‌పీజీ కనెక్షన్‌లు ఉన్నాయి. వీటిలో 1,71,735 మంది పేదలకు ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తోంది. కాగా జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్స్, దాబాల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ బదులుగా గృహాల్లో వాడే సిలిండర్లే వాడుతున్నారు. బషీరాబాద్ మండలంలో 1,107 డొమెస్టిక్ కనెక్షన్‌లుండగా మండల కేంద్రంలోని హోటల్స్, దాబాలన్నింటిలో వీటినే వినియోగిస్తున్నారు. వీరి సదరు గ్యాస్ ఏజెన్సీ యథేచ్ఛగా సబ్సిడీ సిలిండర్లు సరఫరా చేస్తోందనే ఆరోపణలున్నాయి.

అదనపు దోపిడీ

జిల్లాలో డొమెస్టిక్ 14.200 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.856. హైదరాబాద్‌కు ఉన్నా దూరాన్ని బట్టి ఒక్కో మండలంలో ఒక్కో రేటు అమలు చేస్తున్నారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న బషీరాబాద్ మండల కేంద్రంలో సిలిండర్ ధర రూ.872.50 ఉంది. అయితే గ్యాస్ ఏజెన్సీలు తమ గోదాం నుంచి వినియోగదారుడి ఇంటికి 30 కిలోమీటర్ల దూరం వరకు ఒక్కో సిలిండర్‌పై రూ.10, అంతకు మించితే రూ.15 చార్జ్ చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఎక్కడా నిబంధనలు అమలవ్వడం లేదు. గ్యాస్ గోదాం నుంచి రెండు కిలోమీటర్ల దూరం ఉన్న వినియోగదారుడి నుంచి సైతం రూ.30 నుంచి రూ.50వరకు అదనంగా వసూలు చేస్తున్నారని బాహాటంగానే ఆరోపిస్తున్నారు. సదరు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

పదేళ్లుగా కనిపించని తనిఖీలు

పౌరసరఫరాల అధికారుల తనిఖీలు, దాడులు పదేళ్లుగా పడకేశాయి. గతంలో తరుచూ హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల్లో ఆ శాఖ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి కమర్షియల్ సిలిండర్ స్థానంలో సబ్సిడీ సిలిండర్ వాడితే కేసులు నమోదు చేసేవారు. కానీ జిల్లాలో ఎక్కడా ఇలాంటి తనిఖీలు చేపట్టడం లేదు. అధికారులకు గ్యాస్ ఏజెన్సీలు నెలనెలా అందించే మామూళ్ల మత్తులో దాడులు చేయడంలేదనే అపవాదు మూటగట్టుకుంటున్నారు.

రూ.48 అదనంగా తీసుకున్నారు



శ్రీ సత్యసాయి ఏజెన్సీ బషీరాబాద్ నుంచి హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్ తీసుకున్నా. సిలిండర్ ధర రూ.872.50 ఉంటే నా దగ్గరా ప్రతీ సారి రూ.920 వసూలు చేస్తున్నారు. ఇదే విషయమై పలుమార్లు సరఫరా చేసే వ్యక్తిని ప్రశ్నిస్తే రవాణా ఛార్జీలతో కలిపి తీసుకుంటాం అన్నాడు. గ్రామంలోని అందరి వద్ద ఇలానే తీసుకుంటున్నాం అని చెబుతున్నాడు. సిలిండర్ బుక్ చేస్తే వారం తర్వాత డెలివరీ ఇస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించ లేదు.

– తలారి సురేష్, వినియోగదారుడు, మంతట్టి, బషీరాబాద్

రశీదు ఇవ్వడం లేదు



యాలాల మండల కేంద్రం నుంచి మా ఊరు 4 కిలోమీటర్లు. భారత్ గ్యాస్ కనెక్షన్ తీసుకున్నా. ప్రభుత్వం రూ.500లకే సిలిండర్ ఇస్తున్నాం అని చెబుతోంది. కానీ నేను రూ.910 చెల్లిస్తున్నా. ఏజెన్సీ వాళ్లు రశీదు కూడా ఇవ్వడంలేదు. బుక్కులో గ్యాస్ ఇచ్చినట్లు ఎంట్రీ చేస్తున్నారు. రవాణా చార్జీలు ఎంత ఉంటాయో మాకు ఎవరూ చెప్పలేదు. గ్రామంలో అందరి దగ్గర ఇలానే తీసుకుంటున్నారని నేనూ చెల్లించా. గ్యాస్ అక్రమాలను అధికారులు అరికట్టాలి.

– శీలి గీత, వినియోగదారు, గోరేపల్లి, యాలాల

విచారణ జరుపుతాం

సబ్సిడీ సిలిండర్‌లను బ్లాక్‌లో విక్రయించేవారిపై చర్యలు తీసుకుంటాం. గతంలో సబ్సిడీ లేనందున ఎలాంటి తనిఖీలు చేపట్టలేదు. ప్రస్తుతం మహాలక్ష్మీ పథకం కింద జిల్లాలో 1.71లక్షల సిలిండర్‌లకు ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తోంది. ఇప్పటి వరకు 2.74 కోట్లు చెల్లించాం. సబ్సిడీ సిలిండర్‌ను పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. గ్యాస్ ఏజెన్సీల రశీదు మీద ఉన్న ధరనే వినియోగదారులు చెల్లించాలి. రవాణా చార్జీలు ఎక్కువ వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇకపై తనిఖీలు ముమ్మరం చేస్తాం.

– మోహన్‌బాబు, డీఎస్‌ఓ

దిండుతో అదిమిపట్టి.. ఊపిరాడకుండా చేసి

భర్తను కడతేర్చిన భార్య

ఇబ్రహీంపట్నం రూరల్: కట్టుకున్న భర్తనే కడతేర్చింది.. తన నుదిటిబొట్టును తానే తుడిచేసుకుంది. భర్త ముఖంపై దిండుతో ఊపిరాడకుండా చేసి అంతమొందించింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా, కంచిలి మండలం, గొల్లవూరు గ్రామానికి చెందిన షణ్ముఖరావు(51), ఉమాపతి దంపతులు. ఆరు నెలలుగా తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని రాగన్నగూడలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం షణ్ముఖరావు పనికి వెళ్లకుండా స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. అంతా వచ్చి వీరింట్లోనే పడుకున్నారు. కూలి పనికి వెళ్లి వచ్చిన ఉమాపతి గమనించి భర్త స్నేహితుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. దీంతో వారు వచ్చి తమ వాళ్లను తీసుకెళ్లారు. వారు వెళ్లిన వెంటనే భార్యాభర్తలు గొడవపడ్డారు. అప్పటికే ఇద్దరూ మద్యం తాగి ఉన్నారు. కాసేపటికి షణ్ముఖరావు పడుకోగా భార్య ఉమాపతి దిండుతో అతడి మొఖంపై అదిమిపట్టి ఊపిరాడకుండా చేసింది. ఆ తర్వాత పడుకుండిపోయింది. మంగళవారం ఉదయం 7 గంటలకు మేస్త్రీ ఇంటికి వచ్చి తలుపుతట్టగా ఉమాపతి లేచింది. అప్పటికే షణ్ముఖరావు మృతి చెంది ఉన్నాడు. వెంటనే ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, క్లూస్ టీం స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్ ప్లాన్‌లో అందరి భాగస్వామ్యం అవసరం

అదనపు కలెక్టర్ సుధీర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: వికారాబాద్ మున్సిపాలిటీ మాస్టర్ రూపకల్పనలో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్ పరిపాలన, పట్టణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, ఇంజనీర్లు, వార్డు అధికారులకు మాస్టర్ రూపకల్పనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్‌కు అందరి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. రైతులకు, ప్రజలకు నష్టం వాటిల్లకుండా ప్లాన్ ఉండాలన్నారు. శ్మశాన వాటిక గృహ అవసరాలకు జోన్లను గుర్తింపు సైతం ప్రజా ఆమోదయోగ్యంగా ఉండాలన్నారు. ప్రజాభిప్రాయం సేకరించి కౌన్సిల్‌లో అందరి ఆమోదయంతో ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలన్నారు. కావాల్సిన సౌకర్యాలు రాతపూర్వకంగా ప్రస్తావించాలన్నారు. ఇంటింటి సామాజిక, ఆర్థిక సర్వేలో ప్రజాభిప్రాయతం తప్పక చేపట్టాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో డీటీసీపీ అదనపు డైరెక్టర్ రమేష్ బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేశ్‌కుమార్, కమిషనర్ జాకీర్ అహ్మద్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా రుణాలు ఇవ్వరా?

పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు

- సెర్ప్ సిబ్బందిపై డీఆర్‌డీఓ శ్రీనివాస్ ఆగ్రహం



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

బొంరాస్‌పేట: ‘ప్రభుత్వం నుంచి నిధులున్నా మహిళా సంఘాలకు సకాలంలో రుణాలు ఇవ్వరా?, బ్యాంకులతో మాట్లాడి రుణాలిప్పించాలి. నిబద్ధత లేకుంటే చర్యలు తప్పవు’.. అంటూ సెర్ప్ సిబ్బందిపై డీఆర్‌డీఓ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మండలాన్ని సందర్శించి సిబ్బంది పనితీరు, మహిళా సంఘాల అప్పులు, పొదుపులు, సంఘాల కార్యక్రమాలు తదితర అంశాలపై సమీక్షించారు. మహిళా సంఘాల రుణాలు అందించే విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరుపై ఈసీ ఏపీఓ ఎలియాస్, ఏపీఎం సత్తయ్య, సీసీలను హెచ్చరించారు. మహిళా సంఘాల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినా వారికి అందివ్వకపోవడం సిబ్బంది నిర్లక్ష్యమన్నారు. సంబంధిత బ్యాంకులతో మాట్లాడి మహిళాసంఘాలకు రుణాలు అందించాలన్నారు. వచ్చేవారం తనిఖీ చేస్తానని.. అప్పటి వరకు పనితీరు మెరుగు పరుచుకోవాలని హెచ్చరించారు. అనంతరం ఆయన మండల పరిధిలోని ఏర్పుమళ్ల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ‘మనఊరు–మనబడి’ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన గదుల సముదాయాన్ని పరిశీలించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. గ్రామంలోని ఐదు వేల మొక్కల నర్సరీ పనులను పరిశీలించారు. ఉపాధిహామీ పథకం పనులపై సమీక్ష చేసి, బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలపై అడిగి తెలుసుకున్నారు. వారానికోసారి తనిఖీ చేస్తామని చెప్పారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకన్నగౌడ్, హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



గోపాల్ (ఫైల్)

అనంతగిరి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వికారాబాద్ మండలం సిద్దులూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎన్కెపల్లి గోపాల్(52) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకి భార్య, ఇద్దరు కుమారులున్నారు. తరచూ చిన్న కుమారుడైన శ్రావణ్‌కుమార్‌తో ఎద్దుల కొనివ్వాలంటూ గొడవలు జరిగేవి. అతడికి మతి స్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలోనే గోపాల్ సోమవారం సాయంత్రం ఇంటి ప్రహరీ వద్ద రక్తం కారుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘాతుకానికి శ్రావణ్‌కుమార్ కారణమంటూ గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతుడి సోదరుడు పరమేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని సీఐ భీంకుమార్ తెలిపారు.

బాలుడిని హాస్టల్‌కు తరలించిన పోలీసులు



ఎస్‌ఐ జీవీ సత్యనారాయణతో విద్యార్థి శివానంద్

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలోని విద్యార్థి శివానంద్ సోమవారం రాత్రి తప్పిపోయాడు. ఎస్‌ఐ జీవీ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామానికి చెందిన శివానంద్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా డు. శివానంద్‌ను తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బంది మందలించడంతో సోమవారం రా త్రి ఎవరికి చెప్పకుండా పారిపోయాడు. దీంతో గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి శివానంద్ పరిగిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థి శివానంద్‌ను పాఠశాలలో అప్పగించారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు ఆరుగురు

హుడాకాంప్లెక్స్: జాతీయ వాలీబాల్ పోటీలకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అకాడమీ నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ మోహన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ.. వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడహక్ బాడీ నిర్వహిస్తున్న సీనియర్ వాలీబాల్ జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలు రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈ నెల 7 నుంచి 13 వరకు పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించడమే ధ్యేయంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. సీనియర్ వాలీబాల్ పురుషుల జట్టుకు బి.మధు, సిరిల్ రెడ్డి, పరహాన్‌ఖాన్, హబీబ్, ప్రశాంత్, మహిళల జట్టుకు హారిక ఎంపికయ్యారని చెప్పారు. క్రీడాకారులను సన్మానించిన వారిలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్‌లు రవిందర్, చంద్రారెడ్డిలు ఉన్నారు.

వైభవంగా మైసమ్మ పండుగ

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్కలలో మంగళవారం మైసమ్మ పండుగ వైభవంగా నిర్వహించారు. ప్రతీ మూడేళ్లకోసారి నిర్వహించే ఈ ఉత్సవంలో గ్రామస్తులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. డప్పుచప్పుల నడుమ జోగినికి బోనమెత్తి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు అనంతరం మైసమ్మ ఆలయం వద్ద మాతంగి భవిష్యవాణి వినిపించారు. అమ్మవారిని నమ్ముకుంటే ప్రజలపై ఆ తల్లి చల్లని చూపు ఉంటుందని.. పంటలు పండి రైతులు సుభిక్షంగా ఉంటారని చెప్పింది. ప్రజలు అంటు వ్యాధుల బారిన పడకుండా ఉంటారని భవిష్యవాణి వినిపించింది. ఈ సందర్భంగా పోతరాజుల నృత్యాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి.



భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి



రంగం కార్యక్రమానికి హాజరైన గొట్టిముక్కల గ్రామస్తులు

హాజీపూర్ అభివృద్ధికి మరిన్ని నిధులు

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాలాల: మండల పరిధిలోని హాజీపూర్ గ్రామాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. గ్రామానికి ఈజీఎస్ నిధుల్లో భాగంగా రూ.4లక్షలు కేటాయించగా అదనంగా మరో రూ.4లక్షలు కేటాయించాలని ఎమ్మెల్యేను శ్రీనివాస్ కోరారు. బాకారం ఆంజనేయస్వామి ఆలయ ముఖ ద్వారం నుంచి ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా.. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వీటితో పాటు మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, మాజీ వైస్ ఎంపీపీ రమేష్, ఏఎంసీ డైరెక్టర్ రాజు తదితరులు ఉన్నారు.

షెడ్ నిర్మాణానికి భూమిపూజ



శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్

అనంతగిరి: వికారాబాద్ పట్టణం గంగారంలోని డంపింగ్‌యార్డులో పలు అభివృద్ధి పనులకు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. రూ.70 లక్షలతో కూడిన 14వ ఆర్థిక సంఘం నిధులతో మిషనరీ షెడ్ నిర్మాణం, కంపోస్టు ఎరువుల తయారీ యూనిట్ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్ సురేష్, చందర్‌నాయక్, నాయకులు మాలె లక్ష్మణ్, రెడ్యానాయక్, దీపు, సర్వరాజ్, ఏఈ అనిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు పాల్గొన్నారు.

బస్సు ఎక్కుతుండగా బంగారు గొలుసు చోరీ



ప్రయాణికులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పరిగి: ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికురాలి మెడలోంచి బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన పరిగి బస్టాండ్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. పూడూరు మండలం కేరెల్లి గ్రామానికి చెందిన శివలీల తల్లిగారి గ్రామం రాజపూర్ నుంచి తిరిగి వెళ్తున్న క్రమంలో పరిగి బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసు దొంగిలించారు. దీంతో బాధితురాలు పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో బస్టాండ్‌కు చేరుకున్న పోలీసులు ప్రయాణికులు తనిఖీ చేసినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

పొలానికి వెళ్తూ.. బావిలో పడి రైతు మృతి



నర్సింహులు (ఫైల్)

ధారూరు: వ్యవసాయ పొలానికి వెళ్తున్న రైతు దారిలో ఉన్న బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కేరెల్లిలో మంగళవారం వెలుగు జూసింది. ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి నర్సింలు(48) ఈ నెల 5న పొలానికి వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లోంచి బయలుదేరాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం మరో మారు పొలం వద్ద చూద్దామని వెళ్తుండగా చెరువు సమీపంలోని ఊరడి పెంటయ్య బావి పక్కన ఓ చెప్పు కనిపించింది. దీంతో బావిలో పరిశీలించగా మరో చెప్పు కనిపించింది. ఈతగాళ్ల సాయంతో బావిలో వెతగ్గా నర్సింలు మృతదేహం లభ్యమైంది. మద్యానికి బానిసైన రైతు 5న కూడా పూటుగా మద్యం తాగి ఉన్నాడని.. పొలానికి వెళ్తున్న క్రమంలో గట్టుపై నుంచి బావిలో పడిపోయి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య అనిల, ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉంది. ఆయన కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. శవాన్ని వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు